RNI NO:Title-Code:-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103


4లో.

## కేంద్ర కేబినెట్‌లో ఏడు కీలక నిర్ణయాలు

సంపుటి - 1 సంచిక - 23?3 మంగళవారం 03 సెప్టెంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# వర్షాలు, వరదలతో 5వేల కోట్ల నష్టం

- సూర్యాపేటలో పంట నష్టం వివరాలపై ఆరా
- సూర్యాపేటకు తక్షణ సాయం కింద 5కోట్లు
- సూర్యాపేటలో వరదనష్టంపై సమీక్ష
- వరదలపై కేంద్రానికి వివరించామని సీఎం రేవంత్ వెల్లడి



సూర్యాపేట,సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలో రూ. 5 వేల కోట్ల నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తక్షణమే కేంద్రం రూ. 2 వేల కోట్లు కేటాయించాలని కోరామని పేర్కొన్నారు. జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి ప్రధాన మోదీని ఆహ్వానించామని సీఎం చెప్పారు. మిగతాది 2లో...

# రూ.10 వేల తక్షణసాయం

- ఇంటింటికి తిరిగి బాధితులకు నిత్యావసరాలు అందించాలి
- మంత్రులతో కలసి
- ఖమ్మంలో సిఎం రేవంత్ పర్యటన



ఖమ్మం్ల,సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): వరదలకు నష్టపోయిన ప్రతీ కుటుంబానికి తక్షణమే రూ.10 వేల తక్షణ సాయం అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా వరద ప్రాంతాల్లో మంత్రులతో కలసి సిఎం రేంవత్ పర్యటించారు. భారీ వర్షాలకు అతాలకుతలం అయిన ఖమ్మం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. పోలేపల్లిలో వరద బాధితులను పరామర్శించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్..మున్నేరు వరద వందలాది కుటుంబాల్లో విషాదం నింపిందన్నారు. వరదలో నష్టపోయిన కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ఇంటింటికి తిరిగి నిత్యవసర సరుకులు ఇవ్వాలని కలెక్టర్ ను ఆదేశించారు. మిగతా 2లో.



# ప్రభుత్వం మొద్దు నిద్రపోతోంది

- చంద్రబాబు ప్రభుత్వం రెస్క్యూ ఆపరేషన్ చేపడుతోంది... రేవంత్ ప్రభుత్వం చేసింది జీరో: కేటీఆర్
- తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మండిపాటు
- ఏపీ సర్కారు 6 హెలికాప్టర్లు, 150 రెస్క్యూ బోట్లతో సహాయ చర్యలు చేపడుతోందన్న కేటీఆర్
- తెలంగాణలో ఎన్ని హెలికాప్టర్లు, ఎన్ని బోట్లతో ఎంతమంది ప్రాణాలు కాపాడారో? అని ఎద్దేవా


2లో.

# ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలం



- ప్రజలను హెచ్చరించి ఉంటే ప్రాణనష్టం తప్పేది
- పాలించే అర్హత కోల్పోయిన కాంగ్రెస్
- మాజీమంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు మిగతాది 2లో...

సూర్యాపేట్ల,సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలపై ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలం అయిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శలు చేశారు. వర్షాల వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డి నిన్న ఏం చేశారో ఎవరికి తెలియదని ఆరోపించారు.

# హైడ్రా కూల్చివేతలకు తాత్కాలిక బ్రేక్

వర్షాల కారణంగా పనుల నిలిపివేత



2లో.


2లో.

## హైదరాబాద్ విమోచన దినోత్సవానికి అమిత్ షా హాజరు

# నేడు పలు జిల్లాలకు వర్ష హెచ్చరిక

అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సిఎస్ ఆదేశం


2లో.

## కవితకు బెయిల్‌పై పోస్టులు... రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు



- కవితకు బెయిల్ రావడంపై కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టులు
- బెయిల్ వచ్చిందా? ఇచ్చారా? అంటూ పోస్టులు
- ఈ పోస్టులపై వివరణ ఇవ్వాలంటూ రేవంత్‌కు నోటీసులు

2లో.

# సహాయక ముమ్మరం



- వరదబాధితులకు తక్షణ ఆహారం,నీరు
- డ్రోన్ల ద్వారా సరఫరా చేసేలా చర్యలు
- డ్రోన్ సర్వీసులపై సిఎం చంద్రబాబు పరిశీలన
- తోణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- సహాయక చర్యలను పర్యవేక్షించిన బాబు, లోకేశ్

4లో.



## బ్యాడ్మింటన్‌లో నితీశ్‌కు స్వర్ణం..


2లో.

# రూ.10 వేల తక్షణసాయం

(మొదటి పేజి తరువాయి)
అధికారులు ఇంటింటికి తిరిగి నష్టం అంచనా వేస్తారని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు బాధితులకు అండగా నిలవాలని సూచించారు సీఎం రేవంత్. రూ.650 కోట్లతో మున్నేరు వాగు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడతామని చెప్పారు. ప్రాణ నష్టం వాటిల్లిన కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు సీఎం. మిమ్మల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం కదిలివచ్చిందన్నారు. నష్టపోయిన బాధితులను సంపూర్ణంగా ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదన్నారు. కూసుమంచి మండలం నాయకన్ గూడెం దగ్గర వరద ఉధృతితో ఖమ్మం - సూర్యపేట జాతీయ రహదారిపై కొట్టుకపోయిన బ్రిడ్జిని సిఎం పరిశీలించారు.అలాగే పాలేరు రిజర్వాయర్ ను పరిశీలించారు. రాత్రి సీఎం రేవంత్ ఖమ్మంలోనే బస చేయనున్నారు. భారీ వర్షాలకు ఉదయం పాలేరు బ్రిడ్జి తెగిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఏపీ తెలంగాణ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మరో వైపు వరద ప్రభావిత మృతులకు ఎక్స్ గ్రేషియా 4 లక్షల నుంచి 5 లక్షలకు పెంచుతున్న ప్రకటించారు. వరదలకు ఇల్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వానలు, వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రం, మణగూరు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. శనివారం నుంచి కురుస్తున్న వర్షాలతో ఆదివారం ఖమ్మం నగరంలోని పలు కాలనీల్లోకి వరద నీరు చేరింది. మున్నేరును ఆనుకున్న లోతట్టు కాలనీలతో పాటు, లకారం చెరువును ఆనుకొని ఉన్న కాలనీల్లోకి కూడా వరద నీరు చేరింది. నగరంలోని కవిరాజ్ నాగర్, నయాబజార్, ప్రకాశ్ నగర్ చఎ÷-టా ప్రాంతాల్లో ఇండ్లలోకి నీళ్లు వచ్చాయి. నగరంలోని పలు కాలనీల నుంచి లకారం చెర్వులోకి వెళ్లే నాలాలను కబ్జా చేసి, నిర్మాణాలు చేపట్టడంతో వరద నీరంతా కాలనీల్లోకి చేరింది. ఇందిరానగర్, కోర్డు పరిసర ప్రాంతాలతో పాటు కవిరాజ్ నగర్ ప్రధానంగా ముంపునకు గురయ్యాయి. ఆదివారం జిల్లా మొత్తం కలిపి సాయంత్రం 6 గంటల వరకు 269.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా బోనకల్ మండలంలో 43.8, చింతకానిలో 30.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఖమ్మం జిల్లాలో వరద బాధితుల కోసం మొత్తం 39 పునరావాస సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 7,090 మంది ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఉదయం టిఫిన్ తో పాటు భోజనం, ఇతర సౌకర్యాలను కల్పించినట్టు అధికారులు చెబుతున్నారు.

# వర్షాలు, వరదలతో 5వేల కోట్ల నష్టం

(మొదటి పేజి తరువాయి)
ఖమ్మం జిల్లాకు వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. సూర్యాపేట జిల్లాలో కాసేపు ఆగారు. జిల్లాలో జరిగిన పంట, ఆస్తి నష్టం వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. నష్టానికి సంబంధించి ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. సాగర్ ఎడమకాలువ తెగడం వల్ల జరిగిన పంట నష్టంపైన ముఖ్యమంత్రి ఆరా తీశారు. సూర్యాపేట జిల్లాలో 30 సెం.మీ. అతి భారీ వర్షం కురిసిందన్నారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. పంట, ఆస్తి నష్టం పైన అధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. మంత్రులు, ప్రజాప్రతినిధులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు. ఖమ్మం, నల్లగొండ పరిస్థితి పైన ప్రధాని మోదీ, అమిత్ షా, రాహుల్ గాంధీకి వివరించి సాయం కోరినట్లు సీఎం తెలిపారు. వర్షాల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం, పశువులు చనిపోతే రూ. 50 వేల సాయం, పంట నష్టం జరిగితే ప్రతి ఎకరానికి రూ. 10 వేల సాయం, ఇళు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని సీఎం ప్రకటించారు. సూర్యాపేట కలెక్టర్‌కు తక్షణ సాయంగా రూ. 5 కోట్లు కేటాయిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. పాఠశాల సెలవులపైన జిల్లా కలెక్టర్లకు నిర్ణయాధికారం ఇచ్చామన్నారు. వరద బాధితులకు సాయం చేయడానికి ముందుకు వచ్చిన మాజీ



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాష్ట్రానికి నిధులు తీసుకువచ్చేందుకు పని చేయాలని, రాజకీయాలకు ఇది సమయం కాదు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుండపోతగా పడుతున్న వానలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సహాయక చర్యలను ముమ్మరం చేసింది. సహాయక చర్యల్లో సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా 30 సెం మీ వర్షం కురిసిందని అన్నారు. జిల్లాలో ఇద్దరు దుర్మరణం చెందగా 21 చెరువులు కట్టలు తెగాయని తెలిపారు. సాగర్ ఎడమ కాలువకు గండి పడటంతో 15 గ్రామాలకు వరద పొటెత్తిందని అన్నారు. 450 మంది నిరాశ్రయులను పునరావాస కేంద్రాలకు తరలించామని చెప్పారు.వరద ఉధృతికి 7 పక్కా ఇళ్లు కూలిపోయాయని, 33 ఇళ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. విపత్కర సమయంలో అధికారులు చక్కగా పనిచేశారని అన్నారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాల పరిస్థితులపై సహాయం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. జిల్లాలో 20 వేల ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. ప్రతీ రైతుకు ఎకరాకు రూ. 10వేల చొప్పున పంట నష్ట పరిహారం అందజేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇళ్లు కూలిన నిరాశ్రయులకు ఇందిరమ్మ ఇళ్లు, పీఎం నివాస్ యోజన కింద ఇళ్లను కట్టిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. విపత్కర పరిస్థితుల్లో అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించడానికి సూర్యాపేట కలెక్టర్‌కు రూ. 5 కోట్ల నిధులు మంజూరు చేశామని తెలిపారు. వర్షం ఇబ్బందులపై అమెరికాలో ఒకాయన ట్విట్టర్‌లో.. ఇంకొకరు ఫామ్ హౌస్‌లో ఉండి మరొకరు బురద రాజకీయాలు చేయొద్దు అని హితవు పలికారు. విపత్కర సమయంలో ప్రతి ఒక్కరూ సాయం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ కోసం 20మంది ఎమ్మెల్యేలను మాజీ మంత్రి కేటీఆర్ తీసుకొని పోయారని.... ప్రస్తుత పరిస్థితుల్లో వారిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్ మాదిరిగా రాష్ట్రంలో ఎస్డీఆర్ఎఫ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో బృందంలో 100 మంది ఉండేలా 8 బృందాలకు శిక్షణ ఇచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. మంత్రిఉత్తమ్ కుమార్ రెడ్డి, కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం మొద్దు నిద్రపోతోంది

హైదరాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త):
తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం చర్యలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించారు. అదే సమయంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.
పొరుగున ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం 6 హెలికాప్టర్లు, 150 రెస్క్యూ బోట్లతో వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతోందని, కానీ ఇక్కడ తెలంగాణ సీఎం ఎన్ని హెలికాప్టర్లు, ఎన్ని బోట్లతో ఎంతమంది ప్రాణాలు కాపాడారో? అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఇక్కడి ప్రభుత్వం కాపాడింది 'బిగ్ జీరో' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదల నేపథ్యంలో సహాయక చర్యలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వరదలో ఖమ్మంలో రాణి గారు, వారి ముగ్గురు పిల్లలు చిక్కుకుంటే ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. మధిర నుంచి వారి బంధువులు గజఈతగాళ్లని రప్పించి వారే ప్రాణాలు కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.
ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుంటే... ఒక జేసీబీ డ్రైవర్ సోదరుడు తన ప్రాణాలకు తెగించి తొమ్మిది మంది ప్రాణాలను కాపాడారన్నారు. ధైర్యం చెప్పి రక్షించాల్సిన మంత్రులు, చివరికి దేవుడే దిక్కు అని చేతులెత్తేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వరద బాధితులకు రూ.25 లక్షల నష్టపరిహారం డిమాండ్ చేశారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు రూ.5 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుంటారా? అని నిలదీశారు. ప్రతిపక్షాలు ఎన్ని ప్రజా సమస్యలు ఎత్తిచూపినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. వరదలతో సతమతమవుతున్న ప్రజలు సాయం కోరితే లాఠీఛార్జ్ చేస్తారా? సిగ్గు తెచ్చుకోండి... సీఎంగారూ! అని మండిపడ్డారు.

# బ్యాడ్మింటన్‌లో నితీశ్‌కు స్వర్ణం..





హైదరాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త):
పారాలింపిక్స్లో భారత్ జోరు కొనసాగుతోంది. బ్యాడ్మింటన్లో పతక వర్షానికి రంగం సిద్ధం చేసుకున్న భారత్..నితీశ్ కుమార్ పసిడి పతకంతో లెక్క మొదలెట్టింది. పురుషుల సింగిల్స్ ఎస్-ఎల్3 విభాగంలో నితీశ్ కుమార్ చాంపియన్గా నిలిచాడు. సోమవారం జరిగిన పసిడి పోరులో గ్రేట్ బ్రిటన్ షట్లర్ జెనీయాపై 2-1తో గెలుపొందాడు. 21-14, 18-21, 23-21తో ఉత్కంఠగా జరిగిన ఫైనల్లో మెరుపు విజయం నమోదు చేశాడు.తొలి గేమ్ నెగ్గిన నితీశ్కు రెండో గేమ్లో గట్టి పోటీ ఎదురైంది. టైబ్రేకర్కు దారితీసిన నిర్ణయాత్మక మూడో గేమ్లో నితీశ్ పైచేయి సాధించాడు. 2009 రైలు ప్రమాదంలో కాలు కోల్పోయిన నితీశ్ కుమార్ ఐఐటీ మండి నుంచి ఇంజినీరింగ్ పట్టా పొందాడు. జీవితం ముగిసిందనుకున్న తరుణంలో బ్యాడ్మింటన్పై ఏర్పడిన మక్కువ నేడు నితీశ్ కుమార్ను పారాలింపిక్స్ చాంపియన్గా నిలబెట్టింది.అథ్లెటిక్స్లో యోగేశ్ రజత పతకం సాధించాడు. డిస్కస్ త్రో ఎఫ్56 ఫైనల్లో రెండో స్థానంలో నిలిచిన యోగేశ్ మరోసారి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. టోక్యో పారాలింపిక్స్లో సిల్వర్ నెగ్గిన యోగేశ్.. ప్రపంచ చాంపియన్షిప్స్లోనూ రెండు సార్లు సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. 42.22 మీటర్ల దూరంతో యోగేశ్ పారిస్లో మళ్లీ సిల్వర్ మెడల్ దక్కించుకున్నాడు.

# సహాయక చర్యల్లో పాల్గొనాలి

## కాంగ్రెస్ కార్యకర్తలకు రాహుల్ గాంధీ పిలుపు



సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త):
తెలుగు రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదలపై ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. తన ఆలోచనలు అన్నీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలతోనే ఉన్నాయని పేర్కొన్నారు. వరదల వల్ల ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొనాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, పునర్నిర్మాణ ప్రక్రియకు తెలంగాణ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని తెలిపారు. ప్రకృతి విపత్తు కారణంగా నష్టపోయిన వారందరికీ సమగ్ర పునరావాస ప్యాకేజీని సాధ్యమైనంత త్వరగా ప్రకటించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలం

(మొదటి పేజి తరువాయి)
ఖమ్మంలో ప్రజలు వరదలో చిక్కి 9గంటలు సహాయం కోసం ఎదురు చూసినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన ఎందుకు లేదని ప్రశ్నించారు. వరదల నుంచి ప్రజలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. హెలికాప్టర్ కోసం ఎదురు చూసినా రాలేదని ఓ మంత్రి నిస్సహాయత వ్యక్తం చేశారన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి పాలించే అర్హత ఉందా అని నిలదీశారు. భాధ్యత వహించి సంబంధిత మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడిన మంత్రి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం అందుబాటులో లేరా? అని నిలదీశారు. సీఎస్ అలెర్ట్‌ను చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు కూడా ఇంటి నుంచి బయటకు రాకుండా ఉన్నారా అని అడిగారు. సీఎం, మంత్రులు ప్రధానికి ఫోన్ చేసి ఆర్మీ హెలికాప్టర్ కావాలని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి సరైన అప్రమత్తత ఉంటే ఇంత ప్రాణనష్టం జరిగేది కాదని తెలిపారు. ఒక సైంటిస్ట్‌ను కోల్పోయే వాళ్లం కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ప్రకృతికి అప్పగించిందని విమర్శలు చేశారు. నిన్నటి మరణాలకు కారణం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమేనని విమర్శించారు. ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 25లక్షల సహాయం అందించాలని కోరారు.

# హైడ్రా కూల్చివేతలకు తాత్కాలిక బ్రేక్

హైదరాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): చెరువులు, నాలాలు కబ్జా చేసి నిర్మించిన కట్టడాలను హైడ్రా కూల్చివేయడం రాష్ట్రంలో సంచలనంగా మారింది. అయితే ప్రస్తుతం కూల్చివేతలకు హైడ్రా కాస్త బ్రేక్ ఇచ్చింది. భారీ వర్షాల నేపథ్యంలో గ్రేటర్ పరిధిలో మాన్సూన్ సహాయక చర్యల్లో హైడ్రా బృందాలు బిజీ ఉన్నాయి. అలాగే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కూడా బిజీగా ఉన్నారు. వర్షం ఉన్న సమయంలో వాటర్ లాగిన్ పాయింట్స్, లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఆ ప్రాంతాలు నీట మునిగేందుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. చెరువుల పక్కన నిర్మించిన కాలనీల్లో పర్యటిస్తున్నారు. నీరు ఉన్నప్పుడే ఆ ప్రాంతాలను సందర్శించి మార్క్ చేసుకుంటున్నారు. తర్వాత నోటీసులు అందజేసే అవకాశం ఉంది. అలాగే ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టిన వారికి ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. నోటీసులు తీసుకున్న వారు వారం రోజుల్లో ఇళ్లు ఖాళీ చేయాలని అందులో స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటికే 200కు పైగా అక్రమ నిర్మాణాలు కూల్చివేసినట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డికి చెందిన ఇల్లు, ఆఫీసుకు కూడా హైడ్రా అధికారులు నోటీసులు అందజేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత కూల్చివేతల పనిలో హైడ్రా బిజీగా ఉండనుంది.

# నేడు పలు జిల్లాలకు వర్ష హెచ్చరిక

## అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సిఎస్ ఆదేశం

హైదరాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త):
రాష్ట్రంలోని దాదాపు 11 జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలుంటాయని వాతావరణశాఖ హెచ్చరించిందని, ఈ క్రమంలో ఆయా జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. రానున్న 24గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలున్నాయన్నారు. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల్లో వరద పరిస్థితులు, పునరావాసం, సహాయక చర్యలపై సమీక్షించారు. డీజీపీ జితేందర్, విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్,, ÷ర్ సర్వీసుల డీజీ నాగిరెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ ఈ టెలీకాన్ఫరెన్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక రూపొందించి.. ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికు గత నాలుగైదు రోజులుగా వానలుపడుతున్నాయని, రానున్న భారీ వర్షాలతో పరిస్థితులు తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. పోలీస్, తదితరశాఖలతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించే విషయం జిల్లా కలెక్టర్లే నిర్ణయం తీసుకోవాలన్నారు. స్వర్ణ, కడెం ప్రాజెక్టుల గేట్లను తెరవడంతో లోతట్లు ప్రాంతాల ప్రజలను సరక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్మల్ కలెక్టర్‌ను ఆదేశించారు. నిర్మల్ జిల్లాకు 31 సభ్యులు, నాలుగు బోట్లు ఉన్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని పంపుతున్నామని తెలిపారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి 20వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని.. నీటి పరిమాణం ఎక్కువైతే పరీవాహక ప్రాంతాల్లో ముందు జాగ్రత చర్యలను చేపట్టాలని సూచించారు. మహారాష్ట్ర పరీవాహక ప్రాంతం నుంచి వచ్చే వరద గురించి తెలుసుకొని జాగ్రత్తలు చేపట్టేందుకు మహారాష్ట్ర అధికారులతో కోఆర్డినేట్ చేసుకోవాలని సూచించారు. కల్వర్టులు, వాగుల వద్ద సంబంధితశాఖల అధికారులతో జాయింట్ టీమ్‌లను ఏర్పాటు చేసి నిఘా ఉంచాలని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఏ రకమైన సహాయం కావాలన్నా తమను సంప్రదించాలని కలెక్టర్లను కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాలు చేసి 24గంటలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించడానికి క్రేన్‌లను సైతం సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

# కవితకు బెయిల్‌పై పోస్టులు... రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు

హైదరాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కవితకు బెయిల్ వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టులపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాంగ్రెస్ ప్రశ్నిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది.కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చిన సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టులపై సుప్రీంకోర్టు వివరణ అడిగింది. కవిత బెయిల్ అంశంపై సోషల్ మీడియా పోస్టులను సీరియస్‌గా తీసుకుంది. కవితకు బెయిల్ వచ్చిందా? ఇచ్చారా? అంటూ తెలంగాణ కాంగ్రెస్ పోస్ట్ చేసింది. కమలంతో స్నేహం... కవితక్కకు మోక్షం అంటూ పేర్కొంది. తెలంగాణ కాంగ్రెస్ పోస్టులపై వివరణ ఇవ్వాలంటూ పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆయనకు రెండు వారాల గడువును ఇచ్చింది.

# హైదరాబాద్ విమోచన దినోత్సవానికి అమిత్ షా హాజరు

హైదరాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): ఈ నెల 17న జరగనున్న తెలంగాణ విమోచన దినోత్సవానికి కేంద్ర హొూంశాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నారు. ఈ కార్యక్రమాన్ని గత రెండేళ్ల నుండి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది.ఈ నెల 17 జరగనున్న ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ లోణి పరేడ్ గ్రౌండ్స్ మైదానం వేదిక కానుంది. ముఖ్య అతిథిగా హొూం శాఖ మంత్రి అమిత్ షా తో పాటు, పలువురు ముఖ్య నేతలు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం పార్టీ నేతలతో కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సమావేశం అయి, వివిధ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయనున్నారు. గత అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఎన్నడూ లేనన్ని సీట్లు బీజేపీ గెలుచుకోవడంతో బీజేపీ అధిష్టానం జోష్ లో ఉంది.తెలంగాణపై మరింత పట్టు బిగించేందుకు వ్యూహ రచన చేస్తోంది. అందులో భాగంగానే రాష్ట్రంలో పర్యటనలు చేస్తూ.. కార్యకర్తల్లో నూతనఉత్తేజం నింపనున్నట్టు సమాచారం.

# వర్ధన్నపేటలో పర్యటించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

- మాజీ ముఖ్యమంత్రి చిత్రపటానికి నివాళులు - కోనారెడ్డి చెరువు కట్ట పరిశీలించిన ఎమ్మెల్యే
- ఇల్లంద ఎస్సీ కాలనీ బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ


**వర్ధన్నపేట, సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండల పరిధిలో సోమవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ, వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం
వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని కోనారెడ్డి చెరువు వద్దకు వెళ్లి, బుంగ పడిన చెరువు కట్టను పరిశీలించారు. గత రెండు రోజుల నుండి కురుస్తున్న అకాల వర్షాలకు కోనారెడ్డి చెరువులోకి వరద నీరు చేరింది. దమ్మన్నపేట నుండి వస్తున్న నీళ్లతో కొనారెడ్డి చెరువు నీటి విస్తీర్ణం పెరిగిపోయింది. నీటి సామర్థ్యం పెరిగిపోయిన కారణంగా చెరువు కట్టకు రెండు చోట్ల బుంగ పడింది. చెరువు కట్టకు చేరుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కొనారెడ్డి చెరువు కట్టను పరిశీలించి, కట్ట పరిరక్షణకు కృషి చేయాలని



అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం చెరువు మరమత్తు పేరుతో కోట్ల రూపాయలు దండుకొని, చెరువు కట్టను నిర్వీర్యం చేశారని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో రైతుల సంక్షేమం కోసం శాశ్వత పరిష్కారం కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి 100 కొట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి సిఎన్ఎస్ పద్ధతి ద్వారా కట్టను నిర్మిస్తే, మత్స్యకారు సోదరుల కుటుంబాలు చెరువు పైన ఆధారపడి ఉన్నారు. మిని ట్యాంక్ బండ్ గా సుందరీకరణ చేస్తే పర్యాటక కేంద్రంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు.గత కొద్దిరోజుల క్రితం కోణాచలం కెనాల్ నుంచి కోన రెడ్డి చెరువుకు వచ్చే నీటిని సందర్శించి ఎమ్మెల్యే సొంత నిధులతో మరమ్మత్తులు చేయించడం జరిగిందన్నారు. ఆయకట్ట రైతులంత కోనారెడ్డి చెరువు ఆక్రమణకు గురైందని చెప్తున్నారు. దానిని హైడ్రా తరహాలో వాడ్ర తీసుకుని వచ్చి, దురాక్రమాలు అరికట్టే విధంగా కృషి చేస్తానని రైతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అకాల వర్షాలకు చెరువు కట్ట బుంగపడడంతో భారీ వర్షం లో సైతం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులకు సహకరించి కట్ట బుంగ పూడ్చటానికి కృషి చేసిన వారికి ఎమ్మెల్యే నాగరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఇల్లంద, వర్ధన్నపేట పరిధిలో ఏర్పడిన సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. వారి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ కరీమాబాద్ ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేస్తున్న పునరావాస కేంద్రాన్ని, ఖిలా వరంగల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదైన డెంగ్యూ వ్యాధిగ్రస్తుని ఇంటిని సందర్శించి పలు సూచనలు చేశారు.ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నందున కరీమాబాద్ హై స్కూల్లో నిర్వహిస్తున్న పునరావాస కేంద్రాన్ని సందర్శించి, అక్కడ ఉన్న పునరావాసితులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఖీలా వరంగల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదైన డెంగ్యూ వ్యాధిగ్రస్తుని ఇంటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వ్యాధిగ్రస్తుని ఆరోగ్యం పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, వైద్య సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండి, ఇంటింటి జ్వర సర్వే చేపట్టి మందులు పంపిణీ చేయాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మున్సిపల్ శాఖ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంటీ లార్వెల్ ఆపరేషన్, పైరిత్రం స్ప్రే ను పరిశీలించి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేయాలని, సాయంత్రం ఫాగింగ్ చేయించాలని సూచించారు. అదేవిధంగా ప్రజలు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు భుజించకుండా పరిశుభ్రమైన వేడి ఆహారాన్ని తీసుకోవాలని, కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ ఆర్ తోట మెడికల్ ఆఫీసర్ అనిత, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఇన్చార్జ్ ఏ ఎం ఓ మాడిశెట్టి శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ విజయేంద్ర కుమార్, సూపర్వైజర్ సదానందం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితర వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతాల్లో విద్యాసంస్థలకే సెలవు

## మిగతా జిల్లాల్లో కలెక్టర్లదే నిర్ణయం : పొంగులేటి

## పాలేరు ఘటనపై మంత్రి భావోద్వేగం

## ఖమ్మంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): జీహెచ్ఎంసీ పరిధితో పాటు ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మిగతా జిల్లాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సెలవుపై కలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సీఎస్‌శాంతికుమారి, డీజీపీ జితేందర్ తో పాటు కలెక్టర్లు, ఎస్పీలతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఇందులో పాల్గొన్నారు.ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుదని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి భరోసా ఇచ్చారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. ముందస్తు చర్యలు చేపట్టడంతోనే చాలా వరకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అడ్డుకోగలిగామని ఆయన తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 45 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిల్లోకి 3వేల మందికి పైగా తరలించామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. జీహెచ్ఎంసీ పరిధిలో పాత ఇండ్లు, గోడలు కూలే ప్రమాదం ఉండడంతో ముందస్తుగా వారిని పునరావాస కేంద్రాలకు తరలించామని చెప్పారు. తెలంగాణ స్పెషల్ పోలీస్ ఆధ్వర్యంలో 26 ప్లాటూన్ల రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ”నా నియోజకవర్గం పాలేరులో వరదల్లో చిక్కుకున్న ఒక కుటుంబాన్ని రక్షించడానికి చేయని ప్రయత్నమంటూ లేదు.

# 20 లక్షల ఎకరాల్లో పంట నష్టం!

హైదరాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రం లో కురిసిన కుంభవృష్టి పంట పొలాలను ముంచెత్తింది. ఎడతెరిపిలేని వర్షాలతో వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. పలు జిల్లాలో చెరువులకు గండ్లు పడ్డా యి. కాలువగట్లు తెగిపోయాయి. ఉత్తర తెలంగాణలో వర్షబీభత్సం వ్యవసాయరంగాన్ని చిదిమేసింది. వరి పత్తి , మిరప మొక్కజొన్న , కంది తదితర రకాల పైర్ల వరదనీట మునకేశాయి. కొన్ని జిల్లాలోని వాగుల సమీప పొలాలలో ఇసుక మేటలు వేశాయి.వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల మేరకు 20లక్షల ఎకరాల్లో వివిధ రకాల పైర్లకు నష్టం వాటిల్లింది. ఖమ్మం జిల్లా వ్యవసాయరంగానికి భారీ నష్టం వాటిల్లింది. మున్నేరు ఉగ్రరూపం పంట పొలాలను చిదిమేసింది. నదిలో తొలిసారి 36అడుగుల మేర నీరు ఉప్పొంగి ప్రవహించి సమీప గ్రామాల పంటపొలాలను ముంచెత్తింది. జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనాల మేరకు 60వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి.చింతకాని మండలంలోనే 26682ఎకరాల్లో వరి ,24791 ఎకరాల్లో పత్తి పైర్లు దెబ్బదిన్నాయి. మరో 4500ఎకరాల్లో మిరప పంట దెబ్బతింది.
వీటితోపాటు మొక్కజొన్న,పెసర, అరటి , బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి.జిల్లాలోని పాలేరుకు రికార్డు స్థాయిలో 1.60లక్షలక్యూసెక్కుల వరద నదికి ఇరువైపులా పంట పొలాలను తుడిచిపెట్టింది.వేల ఎకరాలు నీటమునిగాయి. పాలేరు అనుసంధాన





కాల్వ కట్ట తెగిపోయింది. మల్లాలయిగూడెం కాల్వకు గండి పడింది. వేలాది గ్రామాలకు చెందిన వరి పొలాలు వరదనీటిలో మునిగి చెరువులను తలపించాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాల వల్ల 3వేల ఎకరాల్లో పైర్లకు నష్ట వాటిల్లిందిజ వరి 1647ఎకరాలు, పత్తి 13 ఎకరాలు, పత్తి 1323ఎకరాలు ఇతర పంటల మరో వెయ్యి ఎకరాల్లో దెబ్బతిన్నట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబురావు తెలిపారు.ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేలాది ఎకరాల్లో పైర్లు నీటమునిగాయి. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు 132.5కి.మి వద్ద , 134.5కి.మి వద్ద గండ్లు పడ్డాయి.దీంతో సాగర్ జలాలు సమీపాన ఉన్న వేలాది ఎకారల పైర్లను ముంచెత్తాయి. సుమారు ఎనిమిది అడుగుల ఎత్తున పొలాల్లో నీరు చేరింది. ప్రాథమిక సమాచారం మేరకు 2000ఎకరాల్లో పైర్లు దెబ్బతిన్నాయి.
అయితే దెబ్బతిన్న పైర్ల విస్తీర్ణం ఇంకా అధికంగానే ఉంటుందని చెబుతున్నారు. సూర్యాపేట మండలం పిల్లలమర్రి పిన్నాయపాలెం వద్ద మూసి ఎడమకాలువకు గండిపడింది. మూసీ వరద పంటపొలాలవైపు పరుగుల తీసి గంటలోనే వేల ఎకరాల్లో పైర్లను ముంచెత్తింది.హుజూర్ నగర మండలంలో బూరుగడ్డ ,గోపాల పురం చెరువుల తెగిపోయి పంటపోలాలు నీటమునిగాయి. నాగుల చెరువుకు గండి పండి చెరువునీరు పొలాలను ముంచెత్తింది. యాదాద్రి జిల్లాలో కొండపోచమ్మ కాలువకు గండిపడి నీరంతా పొలాలను కప్పేసింది.నిజామాబాద్ జిల్లాలో మంజీరానదిలో వరదనీరు ఉప్పొంగింది. గోలిలింగాల, వాడి,నాగిరెడ్డిపేట ,వెంకుపలి తాండూరు, మాటూరు , ఆత్మకూరు గ్రామాల్లో పంటపోలాలు నీటమునిగాయి. మెదక్ జిల్లాలో నారింజవాగు ఉప్పొంగింది. వాగు పరివాహకంగా ఉన్న వేలాది ఎకరాలు నీటమునిగాయి. ఊట్ల చెరువు కొతకు గురై చెరవు నీరు పంటపొలాల్లోకి పరుగులు తీసింది.అదిలాబాద్ జిల్లాలో తాంసి , భీంపూర్ , అదిలాబాద్ ,నార్నూర్ మండలాల్లో వాగులు ఉప్పొంగి వేలాది ఎకరాల్లో పత్తి పొలాలను ముంచెత్తాయి.
వరంగల్ జిల్లాలో 6500 ఎకరాల్లో వివిధ రకాల పైర్లు దెబ్బతిన్నాయి. నెక్కొండ, చెన్నారావుపేట మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి , పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. కూరగాయ పంటలు కూడ దెబ్బతిన్నాయి.పంటనష్టాలపై సమగ్ర సర్వే చేపడుతున్నట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి అనురాధ వెల్లడించారు.

# కేటీఆర్... ఇంకెనాళ్లు అసత్య ప్రచారాలు

## : మంత్రి దామోదర ఆగ్రహం



హైదరాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): రాజకీయాల కోసం అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సూచించారు.
డెంగీ కేసుల విషయంలో కేటీఆర్ చేసిన ట్వీట్‌కు సోమవారం మంత్రి కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో నమోదైన డెంగీ కేసుల కంటే, ఈ ఏడాది తక్కువగా నమోదయ్యాయని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంత్రి ట్విటర్‌లో పోస్ట్ చేశారు. అన్ని వివరాలు తెలుసుకుని ఆ తర్వాత ట్వీట్లు చేయాలని, కేవలం రాజకీయాల కోసం జనాలను ఆందోళనకు గురిచేసేలా అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు.రాష్ట్రంలో డెంగీ, వైరల్ ఫీవర్స్ కట్టడికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారని, ఇప్పటికే ఒక రౌండ్ పూర్తికాగా, ఇప్పుడు రెండో రౌండ్ సర్వే కొనసాగుతోందన్నారు. ఈ సర్వేలలో 2,93,371 మంది బాధితులను గుర్తించి, ట్రీట్‌మెంట్ అందజేశారని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ దవాఖాన్లలో టెస్టింగ్ కిట్లు, మెడిసిన్ అందుబాటులో ఉందని, ప్రజలు ఆందోళన గురికావొద్దని మంత్రి సూచించారు.ం

# కేంద్ర కేబినెట్‌లో ఏడు కీలక నిర్ణయాలు

హైదరాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త):
: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతుల కోసం రూ.13,966 కోట్లు కేటాయింపు, రైతుల కోసం డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ ఏర్పాటు, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌కు రూ.2817 కోట్లు, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సెక్యూరిటీకి రూ.3979 కోట్లు, పశువుల ఆరోగ్యం, డైరీ ఉత్పత్తులకు రూ.1702 కోట్లు, హార్టీకల్చర్ అభివృద్ధికి రూ.860 కోట్లు, కృషి విజ్ఞాన్ కేంద్రం అభివృద్ధికి రూ.1,202 కోట్లు, నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ కోసం రూ.1,115 కోట్లు, 309 కిలోమీటర్ల రహదారికి రూ.18,036 కోట్లు, మన్మాడ్-ఇండోర్ రహదారికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

# తెలుగు రాష్ట్రాలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు విరాళం



హైదరాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు తన వంతు సహాయంగా భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చెరో రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. తన వ్యక్తిగత పెన్షన్ నుంచి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధులకు రూపాయలు ఐదు లక్షల చొప్పున సహాయం అందజేసినట్లు తెలిపారు. కుండ పోత వర్షాలు, ఉధృతమైన వరదలతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వాటిల్లుతున్న నష్టం తనను తీవ్రంగా కలచివేసిందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఫోన్ చేసి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితిని వివరించి, వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపార. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఇప్పటికే మాట్లాడానని, అక్కడి ప్రభుత్వాల యంత్రాంగాలతో, కేంద్ర అధికారులు టచ్‌లో ఉన్నారని ప్రధానమంత్రి చెప్పినట్లు వెంకయ్యనాయుడు వివరించారు. తన వంతు సహకారంగా నా వ్యక్తిగత పెన్షన్ నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి ఐదు లక్షల రూపాయలు,తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి ఐదు లక్షల రూపాయలు సహాయ చర్యల నిమిత్తం పంపించాను. ఈ కష్టకాలంలో ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. యువత కూడా పెద్ద ఎత్తున ముందుకు వచ్చి సహాయక చర్యల్లో పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు. తన కుమారుడు ముప్పవరపు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ తరపున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు అందజేశారని తెలిపారు. తన కుమార్తె దీపా వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్ణ భారత్ ట్రస్ట్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2.5 లక్షలు అందజేశారని వెంకయ్య తెలిపారు.

# నేడు మానుకోటకు సీఎం

మహబూబాబాద్ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): అతి భారీవర్షాలతో అతలాకుతలమైన మహబూబాబా ద్ జిల్లాలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లా నుంచి రోడ్డుమార్గంలో మానుకోటకు చేరుకోనున్నారు.డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి సమీపంలోని సీతారాంతండాను సందర్శించి అక్కడి ప్రజల తో మాట్లాడనున్నారు. భారీ వర్షానికి కొట్టుకుపోయిన బ్రిడ్జి, రోడ్డును పరిశీలించనున్నారు.

# 208 బస్సులు రద్దు



హనుమకొండ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): భారీ వర్షాలతో వరంగల్ రీజియన్ పరిధిలో 208 బస్సులను రద్దు చేసినట్లు ఆర్ఎం విజయభాను తెలిపారు. కటాక్షపూర్ చెరువు మత్తడి పోస్తుండడంతో ఏటూరునాగారం, మంగపేట వైపు బస్సులను నిలిపివేసినట్లు, అలాగే నర్సంపేట-వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, తొర్రూరు-హైదరాబాద్ మీదుగా నడిపే బస్సులను రద్దు చేసినట్లు చెప్పారు.







# సహాయక చర్యలు ముమ్మరం

- వరదబాధితులకు తక్షణ ఆహారం,నీరు
- డ్రోన్ల ద్వారా సరఫరా చేసేలా చర్యలు
- డ్రోన్ సర్వీసులపై సిఎం చంద్రబాబు పరిశీలన
- తీణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- సహాయక చర్యలను పర్యవేక్షించిన బాబు, లోకేశ్

విజయవాడ, సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): ఏపీలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. గ్రామాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వరద నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం.. వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేసింది. వరద ముంపుకు గురైన గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం డ్రోన్లను ఉపయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్రోన్ల ద్వారా ఆహారాన్ని సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారికి డ్రోన్ల ద్వారా ఫుడ్ ప్యాకెట్లు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో డ్రోన్‌లను అధికారులు పరిశీలించారు. అలాగే ఫుడ్ బాస్కెట్స్ తీసుకెళ్లే విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు. డ్రోన్ల ద్వారా ఫుడ్ డెలివరీ విధానాన్ని సీఎంకు ఐ అండ్ ఐ సెక్రటరీ సురేష్ కుమార్ వివరించారు. 8 నుంచి10 కేజీల వరకు ఫుడ్, మెడిసిన్, నీటిని డ్రోన్ల సరఫరా చేయొచ్చని సురేష్ కుమార్ తెలిపారు. డ్రోన్ల ద్వారా ఫుడ్ సరఫరాపై సుముఖత వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు ఎన్ని వీలుంటే అన్ని ఫుడ్ డెలివరీ డ్రోన్లను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. వరద సహాయ చర్యల కోసం నేవీ హెలీకాప్టర్లు రంగంలోకి దిగాయి. ఇప్పటి వరకు నేవీ నుంచి మూడు హెలీకాప్టర్లు వచ్చాయి. హకింగ్‌పేట ఎయిర్ బేస్ నుంచి మరో నాలుగు హెలీకాప్టర్లు బయలుదేరాయి. వరద ముంపు ప్రాంతాల్లో హెలీ కాప్టర్ల ద్వారా ఆహారం, మంచినీరు సరఫరాకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు 2,97,500 మందికి ఆహారం, మంచినీరు అందజేశారు. నిరాశ్రయుల కోసం విజయవాడ నగరంలో 78 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా 17 చోట్ల రోడ్లు తెగిపోయాయి. దీంతో అధికార యంత్రాంగం పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. ప్రకాశం బ్యారేజీ నుంచి ప్రస్తుతం 11,41,276 క్యూసెక్కుల ప్రవాహం వచ్చిచేరుతోంది. వరద బాధితులకు ఆహారం, మంచినీరు పంపిణీ కార్యక్రమాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు నిమగ్నమయ్యాయి. మరోవైపు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఎప్పటికప్పుడు వరద సహాయ చర్యలను పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలిస్తున్నారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంత్రి నారా లోకేశ్ తాజా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. వరద అంచనా, బోట్ ఆపరేషన్, ఆహారం, తాగునీరు పంపిణీ, విద్యుత్ సరఫరాపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 109 బోట్ల ద్వారా ఆహారం, తాగునీటి సరఫరాతో పాటు బాధితుల తరలింపు కొనసాగుతోంది. వరద ప్రభావిత ప్రాంతాలైన సింగ్‌నగర్, రామలింగేశ్వర నగర్ తదితర ముంపు ప్రాంతాల నుంచి 15వేలకు పైగా నిరాశ్రయులను తరలించారు. భారీ వరద కారణంగా పనిచేయకుండా నిలిచిపోయిన సెల్ టవర్స్ సిగ్నల్స్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. విజయవాడలోని 49 ప్రాంతాల్లో 1,39,815 ఇళ్లకు నిలిచిపోయిన విద్యుత్ పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. ఈ సహాయక చర్యలకు సంబంధించి వివిధ ప్రభుత్వ విభాగాధిపతులకు బాధ్యతలు అప్పగించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని లోకేశ్ సమీక్షిస్తున్నారు. డ్రోన్ల సహకారంతో వరద ముంపు ప్రాంతాల్లో సమస్యలను గుర్తిస్తూ ఆదేశాలు ఇస్తున్నారు.

## ఇవి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వచ్చిన వరదలు: జగన్

**విజయవాడ సింగ్ నగర్ లో పర్యటించిన జగన్**

**వరద బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వెల్లడి**

**ప్రభుత్వం నుంచి పైసా సాయం అందలేదని విమర్శలు**

**వాతావరణ శాఖ హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ**



విజయవాడ సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): ఇడుపులపాయలో వైఎస్సార్ కు నివాళులు అర్పించిన అనంతరం వైసీపీ అధ్యక్షుడు జగన్ విజయవాడ వచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈ వరద నష్టం వెనుక చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం ఉందని, వాయుగుండం కారణంగా భారీ వర్షాలు పడతాయని ఈ నెల 28నే వాతావరణ శాఖ చెప్పిందని, కానీ ఆ హెచ్చరికలను చంద్రబాబు సర్కారు పట్టించుకోలేదని జగన్ ఆరోపించారు. ఇవి ప్రభుత్వ అలసత్వం వల్ల వచ్చిన వరదలు అని స్పష్టం చేశారు. వరద బాధితులకు చంద్రబాబు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఎటు చూసినా నీరే కనిపిస్తోందని, బాధితులు ఎక్కడికి వెళ్లాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని... ఒక్కరికి కూడా ప్రభుత్వ ఆర్థిక సాయం అందలేదని మండిపడ్డారు. కనీసం తినడానికి తిండి కూడా లేదని, ఎవరిని కదిలించినా కన్నీరు పెట్టుకుంటున్నారని, వారి కన్నీరు కూటమి ప్రభుత్వానికి కనిపించలేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గతంలో ఇంతకంటే భారీ వర్షాలు కురిసినా, వాలంటీరు వ్యవస్థ సాయంతో పరిస్థితులను చక్కదిద్దామని చెప్పారు. ఇవాళ విజయవాడ సింగ్ నగర్ లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, ప్రభుత్వం అరకొర ఏర్పాట్లు చేస్తే ఎలా సరిపోతాయని జగన్ ప్రశ్నించారు. లక్షల సంఖ్యలో వరద బాధితులు ఉంటే, 6 పునరావాస శిబిరాలు ఎలా సరిపోతాయని నిలదీశారు. విజయవాడలో వరద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చూస్తే, ప్రభుత్వం స్పందించిన తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని విమర్శించారు.

## ప్రకాశం బ్యారేజ్‌పై వాహనాల నిలిపివేత

**భారీగా వరదనీరు రావడంతో పోలీసులు నిర్ణయం**



విజయవాడసెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): వరద ఉధృతి నేపథ్యంలో ప్రకాశం బ్యారేజ్‌పై వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపేశారు. మరోవైపు బ్యారేజ్ గేట్లకు బోట్లు అడ్డుపడ్డాయి. ప్రజలు, వాహనాలతో అక్కడ రద్దీ వాతావరణం ఏర్పడింది. ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీ నుంచి 11.40 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. కాల్వలకు 500 క్యూసెక్కులు వదులుతున్నారు. మొత్తం 70 గేట్లు తెరిచి సముద్రంలోకి నీటిని విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ వద్ద 24.4 అడుగుల మేర నీటిమట్టం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతికి కొట్టుకొని వచ్చిన నాలుగు బోట్లు ప్రకాశం బ్యారేజీ గేట్లకు అడ్డుపడ్డాయి. గేట్ల నుంచి విడుదల చేస్తున్న నీటికి అడ్డుగా మారడంతో నీరంతా నిలిచిపోయింది. ఈ నాలుగు బోట్లు తగలడంతో బ్యారేజీలో ఓ పిల్లర్ పాక్షికంగా దెబ్బతింది. ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణమ్మ మహోగ్రరూపం దాల్చింది. ఇప్పటికే ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియక జనం బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తుంటే.. కృష్ణమ్మ మహోగ్రరూపం దాల్చిందన్న విషయం జనం గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఇంత భారీ స్థాయిలో వరద రావడం ప్రకాశం బ్యారేజి చరిత్రలో ఇదే మొదటిసారి. ఇప్పటికే ప్రకాశం బ్యారేజ్ వద్ద రెండవ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రస్తుత ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 11,39,351 క్యూసెక్కులుగా ఉంది. భారీ వరదలతో రైల్వేశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కృష్ణ కెనాల్ జంక్షన్ నుంచి కృష్ణానది మీదుగా రైళ్లను డెడ్ స్లో చేసి నడుపుతున్నారు. మరోవైపు బ్యారేజీ వద్ద ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. నందిగామ మండలం అంబర్ పేట, ఐతవరం, కీసర వద్ద హైదరాబాద్ –విజయవాడ జాతీయ రహదారిపైకి భారీగా నీరు చేరింది. దీంతో రాకపోకలు బంద్ అయ్యాయి.

## అక్షయపాత్ర సరికొత్త రికార్డు

**ఒకే రోజు మూడు లక్షల మందికి ఆహారం పంపణి**

విజయవాడ, సెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): ఏపీలో మంగళగిరిలో అక్షయ పాత్ర రికార్డు సరికొత్త సృష్టించింది. ఒకేరోజు 3లక్షల మందికి ఆహారం తయారు చేసి ఈ ఘనత సాధించింది. విజయవాడ వాసుల్ని ఆదుకునే క్రమంలో వారికి ఆహారం తయారు చేసి పంపాలని అక్షయపాత్ర సంస్థను సీఎం చంద్రబాబు కోరారు. దీంతో 3లక్షల భోజనం.ప్యాకెట్లు తయారు చేసి పంపించింది. అక్షయపాత్ర సర్వీసులో ఇదే రికార్డు అని సంస్థలో పనిచేసే వారు అంటున్నారు. నే . కాగా, దీనిలో 1.70 లక్షల ఆహార ప్యాకెట్స్ అయ్యే వ్యయాన్ని దివిస్ భర్తిస్తుందని ఆ సంస్థ ఎండి మురళీ కృష్ణ వెల్లడించారు.. ఈ పంపిణీ అయిదు రోజుల పాటు సాగుతుందని ఆయన చెప్పారు.




## కృష్ణా కరకట్టల మరమ్మత్తు: నాదెండ్ల

గుంటూరుసెప్టెంబర్ 2,(జర్నలిస్ట్ వార్త): : కృష్ణా కరకట్ట బలహీనంగా ఉన్న చోట్ల మరమ్మతులు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా పరిధిలో కరకట్టను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బలహీనంగా ఉన్నచోట్ల మరమ్మతులు చేస్తున్నామన్నారు. కృష్ణానది వరద దృష్ట్యా తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. మొత్తం 12 చోట్ల కరకట్ట బలహీనంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. దాన్ని కాపాడటంతో పాటు ప్రాణనష్టం జరగకుండా చూస్తామని చెప్పారు.



# నీలాంటి నాయకుడు ప్రజలకు అవసరం

## తమ్ముడికి అన్న చిరంజీవ జన్మదిన శుభాకాంక్షలు

### మైలురాళ్లు దాటాలని కోరుకుంటున్నట్లు బాబు విషెస్



ప్రజలకు ఈరోజుల్లో పవన్‌కల్యాణ్ లాంటి నాయకుడు కావాలని చిరంజీవి అన్నారు. నేడు పవన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఓ ప్రత్యేక ఫొటోను షేర్ చేశారు. మా పవర్ స్టార్‌కు శుభాకాంక్షలు.. బాబాయ్ పుట్టినరోజున అబ్బాయ్ విషెస్..'కల్యాణ్ బాబు.. ప్రతీ సంవత్సరం నీకు పుట్టినరోజు వస్తుంటుంది. కానీ, ఈ పుట్టినరోజు మరీ ప్రత్యేకం. ఆంధ్ర ప్రజానీకానికి కావలసిన సమయంలో కావాల్సిన నాయకుడు వాళ్ల జీవితంలో పెను మార్పులు తీసుకురావడానికి వాళ్ల ఇంటి పెద్ద బిడ్డగా వచ్చాడు. రాజకీయాల్లో నీతి, నిజాయితీ, నిలకడ, నిబద్ధత కలిగిన ఒక నాయకుడిగా నిన్ను వాళ్ల జీవితాల్లోకి ఆహ్వానించారు. గుండెల్లో స్థానం ఇచ్చారు. అది సుస్థిరం. ఈ రోజుల్లో నీలాంటి నాయకుడు కావాలి, రావాలి. అద్భుతాలు జరగాలి. అది నువ్వు మాత్రమే చేయగలవు, చేస్తావనే నమ్మకం నాతో పాటు ఆంధ్ర ప్రజలందరికీ ఉంది. పుట్టిన రోజు శుభాకాంక్షలు. దీర్ఘాయుష్మాన్ భవ!' అని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు.




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా పవన్‌కల్యాణ్‌కు విషెస్ తెలుపుతూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. ప్రజా జీవితంలో నిబద్ధతతో ఉండే నాయకుడిగా మరెన్నో మైలురాళ్లు దాటాలని ఆకాంక్షిస్తున్నా. చలనచిత్ర సీమలో తిరుగులేని కథానాయకుడిగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఆయన రానున్న రోజుల్లో మరిన్ని అద్భుతాలు చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భగవంతుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆశిస్తున్నా' అని చంద్రబాబు పేర్కొన్నారు.

## శ్రీను వైట్ల దర్శకత్వంలో గోపీచంద్ చిత్రం విశ్వం




టాలీవుడ్ యాక్టర్ గోపీచంద్ నటిస్తోన్న చిత్రం విశ్వం శ్రీను వైట్ల దర్శకత్వంలో వస్తోంది. కొన్ని రోజుల క్రితం జర్నీ ఆఫ్ విశ్వం వీడియోను షేర్ చేయగా.. ఫన్, సీరియస్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగనున్నట్టు చెప్పకనే చెబుతోంది. మళ్లీ చాలా రోజుల తర్వాత ఈ మూవీకి సంబంధించిన అప్‌డేట్‌ను టీజర్ రూపంలో అందించింది శ్రీను వైట్ల టీం. విశ్వం టీజర్‌ను మంగళవారం సాయంత్రం 4:05 గంటలకు లాంచ్ చేస్తున్నట్టు తెలియజేస్తూ స్టైలిష్ లుక్ షేర్ చేశారు. ఇప్పుడీ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీని చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై పాపులర్ డిస్ట్రిబ్యూటర్ కమ్ ఎగ్జిబిటర్ వేణు దోనెపూడి పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి తెరకెక్కిస్తు?న్నారు. గింజ గింజపై తినేవాడి పేరు రాసి ఉంటుంది. దీనిపై నా పేరు ఉంది.. అంటూ ఫస్ట్ స్ట్రైక్‌లో గోపీచంద్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో కావ్యథాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. గోపీమోహన్ స్క్రీన్ ప్లే సమకూరుస్తుండగా.. చేతన్ భరద్వాజ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ సారి గోపీచంద్ ఫుల్ లెంగ్త్ యాక్షన్ ప్యాక్‌డ్ రోల్‌లో కనిపించబోతున్నట్టు అర్థమవుతోంది. చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌లో వస్తున్న తొలి సినిమా ఇది. ఇక ఫస్ట్ స్ట్రైక్‌లో తెగిపడటం.. తెగించగలడం క్రమాన ఫలితం.. విధాత విశ్వం అంటూ సాగే టైటిల్ ట్రాక్ సినిమాపై అంచనాలు పెంచుతోంది.

## కిచ్చా సుదీప్‌తో హనుమాన్ మేకర్స్ చిత్రం






హనుమాన్'తో భారీ విజయం అందుకొంది ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ. తాజాగా ఈ సంస్థ మరో భారీ చిత్రానికి శ్రీకారం చుట్టింది. కిచ్చా సుదీప్ హీరోగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ మేరకు సోమవారం సుదీప్ పుట్టినరోజును పురస్కరించుకొని సినిమా విశేషాలను వెల్లడించారు. 'విక్రాంత్ రోణ' ఫేమ్ అనూప్ భండారీ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందనుంది. ఈ చిత్రానికి 'బిల్లారంగా భాషా -ఫస్ట్ బ్లడ్' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు. ఈమేరకు కాన్సెప్ట్ వీడియో షేర్ చేశారు నిర్మాతలు నిరంజన్ రెడ్డి, చైతన్య. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట హల్‌చల్ చేస్తోంది.

## నా సినిమాపై సెన్సార్ బోర్డు ఎమర్జెన్సీ

### అసహనం వ్యక్తంచేసిన కంగనా రనౌత్



కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'ఎమర్జెన్సీ'ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం తాజాగా మరోసారి వారం రోజులు వెనక్కి వెళ్లింది. సెప్టెంబర్ 6న ప్రేక్షకుల ముందుకురావాల్సిన ఈ చిత్రం మరికొన్ని రోజులు ఆలస్యం కానుంది. ఈ సినిమాపై సెన్సార్ బోర్డు కొన్ని అభ్యంతరాలు చెప్పినట్లు తెలుస్తోంది. తాజాగా దీనిపై కంగనా స్పందించారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ అసహనం వ్యక్తంచేశారు. 'నా సినిమాపై కూడా ఎర్జెన్సీ విధించారు. ఇది చాలా విచారకరమైన పరిస్థితి. నేను నిరాశకు గురయ్యాను' అని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఇక సెన్సార్ బోర్డ్‌ను విమర్శిస్తూ.. ఓటీటీలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'దేశంలోని చట్టం ఏంటంటే.. ఓటీటీలో అయితే ఎటువంటి సెన్సార్ ఉండదు. అనూహ్యమైన హింసను, అశ్లీలతను ప్రదర్శించవచ్చు. రాజకీయంగా పలుకుబడి ఉంటే నిజజీవిత సంఘటనలను కూడా వక్రీకరించి సినిమాలు తీయొచ్చు. ఓటీటీల్లో అంత స్వేచ్ఛ ఉంటుంది. కానీ ఆ స్వేచ్ఛలో కొంచెం కూడా మాలాంటి వాళ్లకు ఉండదు. అందుకే భారతదేశ సమగ్రత, ఐక్యత చుట్టూ తిరిగే చిత్రాలను తీయడానికి మాకు అనుమతి ఉండదు. కొన్ని చిత్రాలు తీయడానికి మనలో కొంతమందికి మాత్రమే సెన్సార్‌షిప్ ఉంది. ఇది అన్యాయం' అని పేర్కొన్నారు. తాను ఆత్మగౌరవంతో ఈ చిత్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. సెన్సార్‌బోర్డ్ సర్టిఫికెట్ ఇవ్వకపోతే తాను కోర్టులో పోరాడటానికైనా సిద్ధమేనన్నారు.

## ప్రగ్యా సర్‌ప్రైజింగ్ అందాల షో



తమిళ చిత్రం 'విరాటు' తో 2014లో సినీ రంగ ప్రవేశం చేసిన ప్రగ్యా జైస్వాల్ తెలుగు లో కూడా అదే టైమ్ లో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు లో మొదటి సినిమా మిర్చి లాంటి కుర్రాడు సినిమా నిరాశ పరిచింది. మొదటి సినిమా నిరాశ పరచినా కూడా 'కంచె' సినిమాలో నటించే అవకాశం ప్రగ్యాకు వచ్చింది. క్రిష్ దర్శకత్వంలో కంచె సినిమాలో మెగా హీరో వరుణ్ తేజ్ కి జోడీగా ప్రగ్యా జైస్వాల్ నటించింది. ఆ సినిమా తో ఒక్కసారిగా టాలీవుడ్ లో ఫేమస్ అయ్యింది. కంచె సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, ఆ సినిమాలో ప్రగ్యా అందానికి, నటనకు మంచి మార్కులు పడ్డాయి.కంచె సినిమా తర్వాత టాలీవుడ్ లో ప్రగ్యా వరుసగా ఆఫర్లు దక్కించుకునే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ ఆమె ఎత్తు టాలీవుడ్ లో ఉన్న చాలా మంది యంగ్ హీరోల కంటే కాస్త ఎక్కువగానే ఉంది. దాంతో ప్రగ్యా తో నటించేందుకు చాలా మంది ఆసక్తి చూపించలేదు. కంచె తర్వాత ఆమె చేసిన సినిమాలు కొన్ని పర్వాలేదు అనిపించుకోగా, ఎక్కువ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడ్డాయి. అయినా కూడా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. బాలయ్యకు జోడీగా నటించిన అఖండ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. అయినా కూడా ఆశించిన స్థాయిలో ఈమెకు ఆఫర్లు రాలేదు.

సినిమాల్లో ఆఫర్లతో సంబంధం లేకుండా సోషల్ మీడియాలో ఈమె అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. అన్ని భాషల నెటిజన్స్ ప్రగ్యా జైస్వాల్ యొక్క అందమైన ఫోటోలకు ఫిదా అవుతూ ఉంటారు. నెట్టింట ఆమె షేర్ చేసే ఫోటోలు రెగ్యులర్ గా వైరల్ అవుతున్నాయి. తాజాగా మరోసారి ప్రగ్యా జైస్వాల్ అందమైన ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

ఈసారి లేత గోధుమ రంగు లో ప్రగ్యా సర్‌ప్రైజింగ్ అందాల షో కు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ స్థాయిలో అందంగా ఉన్నా కూడా పాపం ప్రగ్యా జైస్వాల్ కు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు, రావాల్సిన ఆఫర్లు రావడం లేదు అనే కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి.అఖండ సినిమా తర్వాత టాలీవుడ్ లో ఈ అమ్మడు బాలకృష్ణ తో మరోసారి నటిస్తోంది. బాలకృష్ణ, బాబీ కాంబోలో రూపొందుతున్న సినిమాలో ఒక హీరోయిన్ గా ప్రగ్యా కనిపించబోతుందనే వార్తలు చాలా రోజులుగా వస్తున్నాయి. ఇప్పటి వరకు మేకర్స్ నుంచి మాత్రం అధికారిక ప్రకటన రాలేదు. సినిమా టైటిల్ ను ప్రకటించిన సమయంలో ప్రగ్యా పాత్ర గురించి మేకర్స్ ఒక క్లారిటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. బాలయ్య 109వ సినిమాను ఇదే ఏడాది డిసెంబర్ లో విడుదల చేయాలని భావిస్తున్నారు. బాలయ్య సినిమా వచ్చిన తర్వాత అయినా ప్రగ్యాకు మళ్లీ వరుస ఆఫర్లు వస్తాయేమో చూడాలి.